క్లుప్తంగా

నిరుపేదలకు రంజాన్ తోఫా అందజేత



మహిళకు తోఫా అందజేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: మండల కేంద్రంలో బుధవారం ఆల్ మైనారిటీ ఎంప్లాయి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు రంజాన్ తోఫాను గౌరవ అధ్యక్షుడు రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పండుగను పేదలు సంతోషంగా జరుపుకోవాలన్న ధ్యేయంతో అసోసియేషన్ 112 మంది పేదలకు తోఫా అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఉద్యోగి పేదలకు సహాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు లతీఫ్, ప్రెసిడెంట్ రబ్బానీ, రిటైర్డ్ హెచ్‌ఎం మగ్బూల్, సభ్యులు పాల్గొన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి

నంద్యాల(అర్బన్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో ఉన్న డీఆర్‌డబ్ల్యూఏ (డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్) కార్యాలయంలో బుధవారం వంద మంది నిరుపేద దివ్యాంగులకు రంజాన్ కిట్లు, చీరలు పంపిణీ నిర్వహించారు. డీఆర్‌డబ్ల్యూఏ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సమాజసేవకురాలు వహిద మాట్లాడుతూ రంజాన్ పండుగను వికలాంగులందరూ సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో కిట్లు, చీరల పంపిణీ చేపట్టామన్నారు. వికలాంగులకు ఎప్పుడూ తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో టీవీ టెక్నీషియన్ కోటేశ్వరరావు, కిరణ్‌కుమార్, బాలతిమ్మయ్య, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు

రుద్రవరం: మేజర్ పంచాయతీ రుద్రవరంలో తాగు నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం సంత మార్కెట్‌లో కొత్త బోరు వేయించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మేజర్ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. సర్పంచు బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రెండు కొత్త బోర్లు వేయిస్తున్నామని వాటి ద్వారా ట్యాంకులకు నీరు ఎక్కించి గ్రామస్తులకు సరఫరా చేస్తామన్నారు.

1న పింఛన్ల పంపిణీ

ఉయ్యాలవాడ : ఏప్రిల్ 1వ తేదీన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో 3,795 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ. 1,60,52,000 నిధులు మంజూరు అయ్యాయన్నారు. సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తారన్నారు.

చిల్లర పనులు మానుకోండి

- చేతనైతే ప్రజలకు సేవ చేయండి
- ఎమ్మెల్యే అఖిలప్రియకు వైఎస్సార్‌సీపీ నేత భూమా కిశోర్‌రెడ్డి హితవు
- రూపాయి పావలా కమీషన్ కోసం గోదాం నిర్వాహకులను పీక్కొతింటున్నారని ధ్వజం

ఆళ్లగడ్డ: కమీషన్ల కోసం చిల్లర పనులు మానేసి చేతనైతే ప్రజలకు సేవచేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్ రెడ్డి హితవు పలికారు. బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులకు సాగునీరు అందకపోతే ఆ నింద తమ పార్టీపై వేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది మీరా మేమా అని ఎమ్మెల్యేను నిలదీశారు. కేసీలో కనీసం అడుగులోతు కూడా సాగునీరు పారడం లేదు. శిరివెళ్లలో పంటలు సాగు చేసిన రైతులు తమకు ఆత్మహత్యే శరణ్యమంటూ కన్నీరు పెడుతుంటే పట్టించుకోరా అని మండిపడ్డారు. అధికారులు పనిచేయడం లేదని



సెల్‌లో శిరివెళ్ల రైతుల గోడును వినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి

స్వయంగా మీ తమ్ముడే అంటున్నారని, దీనిని బట్టి మీ కూటమి ప్రభుత్వం చేతకానిదని ఒప్పుకున్నట్టే కదా అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా ఇవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. నాడు ఓట్ల కోసం మోసపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని మండిపడ్డారు.

ఆళ్లగడ్డ పరువు తీయొద్దు

చికెన్ సెంటర్ల నిర్వాహకులు కిలోకు రూ.10 మాములు ఇవ్వలేదని ఆళ్లగడ్డలో దుకాణాలు మూయించేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి అన్నారు. గతంలో ఏ రాజకీయ నాయకులు ఇలాంటి నీచమైన పనులు చేయలేదన్నారు. ఎమ్మెల్యే ఆళ్లగడ్డ చరిత్రను మంట గలిపారన్నారు. బీసీలకు ప్రభుత్వం రుణాలు ఇస్తే వాటిని కూడా వదలడం లేదని ధ్వజమెత్తారు. అహోబిలంలోని యాచకుల వద్ద కూడా వాటా కోసం దిగజారిపోయారని విమర్శించారు. చదరపు అడుగుకు రుపాయి పావలా కావాలని గోదాం నిర్వాహకుల వద్ద పీక్కొతింటున్నారన్నారు. ఈ దోపిడీకి హద్దు లేదా అని ప్రశ్నించారు. మీ పార్టీ వ్యక్తి, సొంత బాబాయి భూమా బ్రహ్మానందరెడ్డి గోదాంను లీజ్ తీసుకునేందుకు వస్తే కమీషన్ ఇవ్వాలని అడగడం సిగ్గుచేటన్నారు. సొంతబాబాయినే మీరు వదల లేదంటే మాములు గోదాం నిర్వాహకుల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదన్నారు. శిల్పా వెంచర్‌లో సామాన్యులు చట్టపరంగా స్థలం కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్లు చేసుకోకూడదనడం న్యాయమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అవినీతిని మాని ప్రజలకు సేవ చేసుకోవాలని హితవు పలికారు.

కోర్టు విధులను బహిష్కరించి నిరసన



నంద్యాల కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాదులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య మాట్లాడుతూ తెలంగాణలో ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని అత్యంత కిరాతకంగా హత్య చేసి నటువంటి ముద్దాయిని వెంటనే శిక్షించాలని కోరారు. అదే విధంగా కర్నూల్‌లో మహేంద్రనాథ్ రెడ్డి న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి తప్పుడు కేసులు పెట్టారని, దీనిని కూడా తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. త్వరలో న్యాయవాద రక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం కోర్ట్ ఆవరణలో నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నటరాజరావు, మనోహర్ రెడ్డి, రమణారెడ్డి, ఓబుళరెడ్డి, తిరుపతి, సీనియర్ జూనియర్ న్యావాదులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు అన్నారు. బుధవారం ఆ యూనియన్ జాతీయ మహాసభల లోగోలను విడుదల చేశారు. అనంతరం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లెనిన్‌బాబు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. ఉన్న అరకొర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టు ద్వారా దేశంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై పోరాటానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు మే 15వ తేది నుంచి 18వతేది వరకు తిరుపతిలో నిర్వహించే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, ఏఐవైఎఫ్ కార్యదర్శి నాగరాముడు, బాబా ఫకృద్దీన్, సుంకయ్య ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ మహాసభల లోగో విడుదల చేస్తున్న నాయకులు

కూలీలు 11 గంటల్లోపే ఇంటికి వెళ్లాలి

దొర్నిపాడు: ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున ఉదయం 6 గంటలకు పనులకు వెళ్లి 11లోపు ఇంటికి చేరుకునేలా కూలీలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సావిత్రి క్షేత్ర సహాయకులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు పెంచిన వేతనం రూ.300 అందాలంటే తప్పని సరిగా కొలతల మేరకు పనులు చేయించాలన్నారు. ముఖ్యంగా క్షేత్ర సహాయకులు దగ్గరుండి మేటీలతో పనులు చేసేలా చూసుకోవాలన్నారు. ఊరికే పనుల వద్దకు వెళ్లి హాజరు వేయించుకొని ఇంటికి చేరితే వేతనం రాదని హెచ్చరించారు. కనీసం 4గంటలైనా పనులు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. పనులకు రాకపోయినా మస్టర్ వేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గంగన్న, ఈసీ సోమశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు బషీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉపాధిలో ఉయ్యాలవాడ ముందంజ

ఉయ్యాలవాడ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లాలోనే ఉయ్యాలవాడ మండలం ముందంజలో ఉందని ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఏపీఓ రవిప్రకాష్, టీఏ షరీఫ్, బీఎఫ్‌టీలు రంగస్వామి, జ్వాలా నరసింహుడు, సీఓలు మహబూబ్‌పీరా, మధుసూదన్‌రెడ్డిని శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పనిదినాలు కల్పించడంలో వంద శాతం ఈ నెలాఖరుకు పూర్తి అవుతాయన్నారు. అయితే ఉయ్యాలవాడ మండలంలో ఇప్పటికే 103 శాతం పని దినాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో బదిలీపై వెళ్తున్న ఏపీఓ రవిప్రకాష్, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావు, ఏఈఓలు రాణెమ్మ, సునీత, హౌసింగ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో బదిలీపై వెళ్తున్న ఉపాధి సిబ్బందిని సన్మానిస్తున్న ఏపీడీ, ఎంపీడీఓ

ఉపాధి సిబ్బంది బదిలీ

శిరివెళ్ల: ఉపాధి పథకం సిబ్బంది బదిలీ అయినట్లు ఏపీఏ రామసుబ్బయ్య బుధవారం తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఉమామహేశ్వరి పాణ్యంకు, సుబ్బరాయుడు, లక్ష్మీప్రసన్నలు నంద్యాలకు, శివలింగమయ్య బండి ఆత్మకూరుకు, కంప్యూటర్ ఆపరేటర్లు నరసింహరాజు నంద్యాలకు, హసీనా పర్వీన్ రుద్రవరానికి బదిలీ అయ్యారన్నారు.

బ్యాక్టీరియా, శిలీంద్రాలతో నేల సారవంతం

నంద్యాల(అర్బన్): బ్యాక్టీరియాలు, శిలీంద్రాలు జరిపే నిరంతర ప్రక్రియ ద్వారా నేల సారవంతమవుతుందని జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య అన్నారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని చాబోలు, కానాల గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వసతి గల రైతులు అందరూ వేసవిలో పెసర, మినుము, కొర్ర పంటలు వేసుకొని నేల పచ్చగా ఉండేటట్లు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి నంద్యాల ప్రసాదరావు మాట్లాడుతూ రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ ఇప్పటివరకు నంద్యాల మండలంలో 43% పూర్తి అయిందని మిగిలిన రైతులు త్వరగా చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ చెల్లింపులు, పంటల బీమా రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, పంట రుణాలు తదితర పథకాలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి ముక్తారుబాషా, రైతు సేవ కేంద్ర సిబ్బంది హర్షిత, పుష్పలత, వైష్ణవి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

వక్ఫ్ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలి

నంద్యాల(అర్బన్): పార్లమెంట్‌లో త్వరలో చర్చకు రానున్న వక్ఫ్‌బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనుస్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇస్తే మైనార్టీల మనోభావాలను గాయపరిచినట్టేనని చెప్పారు ఈ బిల్లు పాస్ అయితే ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ బిల్లును మైనార్టీ సంఘాల నాయకులు, లౌకిక వాదులు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు.



గోస్పాడులో రహదారి పక్కన పుచ్చకాయల విక్రయ దృశ్యం



అమ్మకానికి కోసి ఉంచిన పుచ్చకాయలు

నోరూరించే పుచ్చకాయ

గోస్పాడు: ఎండలు మండుతున్నాయి.మార్చినెలలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో ప్రజలు వేడిమికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ పరిస్థితుల్లో వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు శీతల పానియాలు, తాటిముంజలు, పుచ్చకాయలను ఆశ్రయిస్తున్నారు. పుచ్చకాయ శరీరంలో వేడిని తగ్గించడంతో పాటు చలువ చేస్తుంది కనుక చాలా మంది వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో నంద్యాల, గోస్పాడు, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రాంతాల్లో వాటి కొనుగోలు పెరిగింది. స్థానిక వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి కేజీ రూ.25 నుంచి రూ. 30 ప్రకారం విక్రయిస్తున్నారు. సైజును బట్టి ఒక్కో కాయ రూ.100 నుంచి రూ.250 వరకు ధర పలుకుతోంది. శరీరానికి ఎంతో మేలు చేసే పుచ్చకాయ వంద గ్రాములు తీసుకుంటే అందులో 91.45 గ్రాముల నీరు, ఆరు శాతం చక్కెర, 30 క్యాలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల మాంసకృత్తులు, 12 గ్రాముల పొటాషియం , ఏడు గ్రాముల కాల్షియం, ఒక మిల్లీ గ్రాము సోడియం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

మల్లయ్య చెంత చేరేందుకు..!

కన్నడ భక్తులు కొందరు పాదయాత్రగా .. మరికొందరు మరగాళ్లపై .. ఇంకొందరు కంబీలతో తరలివస్తున్నారు.. మార్గమేదైనా మల్లయ్య చెంతకు చేరడమే అందరి లక్ష్యం. వందల కిలోమీటర్లు.. చెట్టనకా.. పుట్టనకా.. ఎండనకా వాననకా భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను మనస్సుల్లో ధ్యానించుకుంటూ నిండుభక్తితో ప్రయాణం సాగిస్తూ శ్రీగిరి పర్వతం చేరుకుంటున్నారు. ఆత్మకూరురూరల్

- మరగాళ్లపై శ్రీపర్వతానికి నడక
- కంజిల మోతతో కనువిందుగా..
- యుద్ధ విద్యను పోలిన పురావంత్ సేవ
- వందల ఏళ్లుగా సంప్రదాయాలను నిలుపుకుంటున్న కన్నడిగులు

జంతువులను గుర్తించేందుకని..

బారులుగా తరలివచ్చే కన్నడిగుల మధ్యలో ఎత్తైన కర్రలపై ఏమాత్రం తొణికిసలాడకుండా మామూలు నడకలా సాగుతున్న కొందరు కనిపిస్తుంటారు. వారి కాళ్లకు కట్టిన కర్రకాళ్లను మరగాళ్లు అని పిలుస్తారు. ఈ ఆచారానికి దైవారాధనకు పెద్దగా సంబంధం లేనప్పటికీ పెద్ద సంఖ్యలో మరగాళ్లపై పాదయాత్రికుల వెంట వెళ్లేవారు కనిపిస్తారు. పూర్వం యుద్ధ సమయాల్లో సైనికులు బారులుగా నడిచేటప్పుడు ముందు, వెనుక (పైలట్ గార్డు, రియర్ గార్డు) సైనికులు ఇలా మరగాళ్లపై నడిచేవారు. వారు కర్రకాళ్లపై ఎత్తుగా ఉండడంతో ముందు, వెనక వచ్చే శత్రువుల జాడను పసిగట్టేవారు. అలా సైనిక వ్యూహం లోనుంచి వచ్చిందే పాదయాత్రికుల మరగాళ్ల పద్ధతి అని రామణ్ణ అనే మరగాళ్ల యాత్రికుడు తెలిపారు. మరగాళ్లపై నడిచే వారు అడవిలో దూరంలో ఉన్న క్రూరమృగాల ఉనికిని కనిపెట్టి ఇతరులను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

మరిన్ని ఆరాధనా మార్గాలు..

శ్రీశైల పాదయాత్ర మార్గాన్ని పరిశీలిస్తే కన్నడిగుల విభిన్న ఆరాధనా పద్ధతులు కనిపిస్తాయి. పాదయాత్ర కష్టమైనదని భావిస్తే.. కొందరు సాష్టాంగ దండ ప్రణామాలు ఆచరిస్తూ వందల కిలోమీటర్ల దూరం అధిగమించి శ్రీశైలం చేరుకోవడం ఒక అద్భుతం. గ్రామంలో ఉండే ఆలయాలకు ఇంటి నుంచి వెళ్లే ఈ ఆచారాన్ని శ్రీశైలం వరకు చేయడం విచిత్రం. అలంకరించిన గుర్రాలపై, అలంకరించిన ఎద్దుల బళ్లపై మరికొందరు ఈ పాదయాత్రలో పాల్గొంటారు. నంది కోళ్లు, నాగలూటి వీరభద్రాలయం వద్ద అగ్ని వీర పూజలు కూడా నిర్వహిస్తారు.



శ్రీశైల పాదయాత్రమార్గం



కాలినడకన ఆత్మకూరు మీదుగా వెళ్తున్న కర్ణాటక భక్తులు

శ్రీశైల క్షేత్రానికి భారీగా తరలుతున్న కన్నడిగులు

ఆత్మకూరు: ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలం మహాక్షేత్రానికి కర్ణాటక భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో కర్ణాటక భక్తుల సందడి అంతాఇంతా కాదు. గత పది రోజులుగా శ్రీశైల క్షేత్రానికి కాలినడకన, వివిధ వాహనాల్లో తరలివెళ్తున్నారు. ఉగాది పండగకు మూడురోజులే వ్యవధి ఉండడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సులతో పాటు భారీ సంఖ్యలో వివిధ వాహనాలు తరలివెళ్తున్నాయి. కర్ణాటక పాదయాత్రికుల కోసం కర్నూలు సమీపంలోని ఎల్లమ్మ ఆలయం, గార్గేయపురం, నంది కొట్కూరు, జూపాడుబంగ్లా, జూటూరు, కరివేన, ఆత్మకూరు, పాములపాడు, లింగాల, సుజ్జాల, క్రిష్టాపురం, వెంకటాపురం, నాగలూటి, పెచ్చెరువు తదితర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండు వద్ద మజ్జిగ, ఉప్మా, పులిహోర, మంచినీటి ప్యాకెట్లను సరఫరా చేశారు.

కంబీలను శ్రీశైల వాసుడి ప్రతిరూపాలు..

శ్రీశైల పాదయాత్రికుల్లో కొందరు భుజాలపై కావడిని మోస్తూ నడుస్తుంటారు. నంది ముఖాలు పోలిన దారు శిల్పాలు కలిగిన కర్రలను కావడికి రెండు వైపులా ఉంచి మోస్తుంటారు. వీటిని కంబీ అని పిలుస్తారు. ఇలాంటి కంబీలు ఉత్తర కర్ణాటక గ్రామాల్లో ప్రతి ఇంటా పూజాగృహాల్లో ఉంటాయి. వీటిని ఉగాది బ్రహ్మోత్సవాల(పరిశె) పాదయాత్రలో శ్రీశైలం వరకు మోస్తూ వెళతారు. పవిత్ర కృష్ణా జలాల్లో(పాతాళగంగ) కంబీలను సంప్రోక్షణ చేసి వాటిని శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ కంబీలను ఆయా కుటుంబాల వారి ఆర్థిక స్తోమతను బట్టి అలంకరిస్తారు. వెండి తలాటాలతో కొన్ని, ప్లాస్టిక్ పూలతో మరికొన్ని అలంకరిస్తారు. శ్రీశైల మల్లికార్జున దర్శనానికి వెళ్లి తిరిగి గ్రామానికి చేరిన కంబీలను సాక్షాత్తూ శ్రీశైల వాసుడి ప్రతిరూపాలుగా ఆయా గ్రామాల వారు భావించి పూజిస్తారు.



వెండి తలాటాలతో కంబీ కావడి మోస్తున్న కన్నడిగులు

వీరశైవ వీరారాధనకళారూపం 'పురవంత్ సేవ'

శైవారాధనలో వీరారాధన ప్రముఖమైనది. అలాంటి కళారూపమే 'పురవంత్ సేవ', సంగీత, గాత్ర, జంత్ర వాద్య, నాట్య సమాహార కళ పురవంత్ సేవ. ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని నాగలూటి వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ఆరాధనా కార్యక్రమంలో పురవంత్ సేవ కళారూపాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తారు. పురవంత్ సేవలో పాల్గొనే కళాకారులు ప్రత్యేక అలంకరణతో కూడిన దుస్తులు ధరించి, రెండు చేతుల్లో ఖడ్గాలను పట్టుకుని విన్యాసాలు చేస్తూ నేపథ్యంలో వచ్చే సంగీతానికి అనుగుణంగా కాలు కదుపుతూ గానం చేస్తారు. అగ్ని గుండంలో నడుస్తారు. ఒంటిపైన, నాలుకకు దబ్బనాలు గుచ్చుకుంటారు. అయినా ఒక్క రక్తపు చుక్క కూడా రాకపోవడం గమనార్హం. సతీ వియోగంతో పరమశివుడు ఆగ్రహోదగ్రుడై ప్రళయకాల ప్రభంజనంతో నాట్యం చేస్తూ తన ఝటాజుటాన్ని పెరికి నేలకు కొట్టడం ద్వారా భయంకర రూపంతో వీరభద్రస్వామి ఉద్భవిస్తాడని పురానాల ద్వారా తెలుస్తోంది. ఆయన తన ప్రతాపంతో దక్షప్రజాపతి యజ్ఞవాటికను విధ్వంసం గావించడమూ పురాణ ప్రశస్తి. ఆ క్రమంలో పుట్టినదే వీరశైవారాధన. నాగలూటి వీరభద్రుడిని కన్నడిగులు కడప మాను వీరభద్రస్వామి అని పిలుచుకుంటారు. శ్రీశైలానికి కడప వంటి నాగలూటిలో వెలసిన దైవంగా ఆయనను ఈరణ్ణా అంటూ ఆరాధిస్తారు. పురవంత్ సేవ కళాకారులు వీరభద్ర ఆలయాల వద్ద ఈ ప్రదర్శనలిస్తూ భక్తులను ఆనంద పరవశులను చేస్తారు.



పురావంత సేవలో వీర ఖడ్గధాలన ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎంపీటీసీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



బొమ్మలసత్రం: మండల పరిధిలోని పుసులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు, ఎంపీటీసీముక్కర సుదర్శన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఎంపీటీసీ చికిత్స నిమిత్తం ఇటీవల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి ఆసుపత్రికెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్ కృష్ణమోహన్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, నాయకులు దాదా, నజీర్ తదితరులు ఉన్నారు.

తొలగించిన ఆశా కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): బండి ఆత్మకూరు పీహెచ్‌సీ కొత్తపల్లి గ్రామంలో తొలగించిన ఆశా కార్యకర్త విమలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసు రత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి రమణకుమారి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలోవారు మాట్లాడారు. విమల ఆశా కార్యకర్తగా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తన విధులను సక్రమంగా నిర్వహించడమే కాక గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని చెప్పారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వీహెచ్‌ఎస్ఎన్‌సీ కమిటీ సమావేశంలో ఆమెను తొలగిస్తున్నట్టు తీర్మానం చేశారన్నారు. రాజకీయ నాయకులు తమ అనుయాయులకు ఉద్యోగాలు ఇప్పించుకోవాలంటే కొత్తగా ఉద్యోగాలు సృష్టించి ఇవ్వాలన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు అండగా ఉంటామని వారికి న్యాయం చేస్తామని చెప్పారని, క్షేత్రస్థాయిలో ఇది జరగడం లేదన్నారు.